క్లుప్తంగా

విద్యార్థిపై మరో విద్యార్థి తల్లి దాడి

బోధన్‌టౌన్(బోధన్): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిపై మరో విద్యార్థి తల్లి దాడి చేసింది. కళాశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు సోమవారం గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఇద్దరు విద్యార్థులను సముదాయించి గొడవ సద్దుమణిగేలా చేశారు. మంగళవారం ఇద్దరు విద్యార్థుల్లో ఒక విద్యార్థి తన తల్లిని వెంట పెట్టుకొని కళాశాలకు వచ్చి తన కొడుకుతో గొడవ పడిన విద్యార్థిని తరగతి గదిలో నుంచి బయటకు లాక్కువచ్చి కొట్టింది. గమనించిన అధ్యాపకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి విద్యార్థి తల్లిని సముదాయించి పంపించేశారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



బాల్కొండ: వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డిని, డైరెక్టర్ పబ్బ రాకేష్‌ను మంగళవారం బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. నాయకులు రఘుపతి, కొత్తపల్లి దేవేందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు. మెండోరా తహసీల్ కార్యాలయ సిబ్బంది కూడా చైర్మన్‌ను సన్మానించారు.

రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌కు..



బాల్కొండ: రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బాల్కొండ మండల కేంద్రానికి చెందిన వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఘనంగా సన్మానించారు. నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, అరవింద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషి

ఆర్మూర్‌టౌన్: ప్రధాని మోదీ భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి ఎంతో కృషిచేస్తున్నారని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ అన్నారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో బూత్ నెంబర్ 61, 62లలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ నేతలు వివేకానంద్, కృష్ణగౌడ్, మోహన్ రెడ్డి, సాయిరాం, సుదర్శన్‌పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

కమ్మర్‌పల్లి: కోనాసముందర్ గ్రామానికి చెందిన మహేశ్‌కు రూ. 2.75లక్షల ఎల్‌వోసీ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహేశ్‌కు ఆపరేషన్ అవసరం కాగా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఎల్‌వోసీ మంజూరు చేయించారు. కాంగ్రెస్ నాయకులు సామ భూమారెడ్డి, జైడి శ్రీను, రమేశ్ గౌడ్, లింబాద్రి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మోరా గ్రామస్తుడికి..

బాల్కొండ: మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన సీహెచ్ రాజన్న అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి వైద్యం కోసం రూ.2.5 లక్షల ఎల్‌వోసీని సీఎం సహాయ నిధి నుంచి ఇప్పించారు. ఎల్‌వోసీ కాపీని మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బోధన్: సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థులను బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. ఆర్‌బీకేఎస్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఫార్మసిస్ట్ శ్వేత, హెచ్‌ఎం ధన్‌రాజ్, టీచర్లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రుద్రూర్: రుద్రూర్ మండల పంచాయతీ అధికారిగా లక్ష్మారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా విధులు నిర్వర్తించిన సాయిలు పదవీ విరమణ పొందడం వల్ల పోస్టు ఖాళీగా ఉంది. దీంతో డీఆర్‌డీఏ అకౌంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మారెడ్డి డిప్యుటేషన్‌పై ఎంపీవోగా వచ్చారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో సురేష్ బాబు, మాజీ జెడ్పీటీసీ నరోజీ గంగారాం, మాజీ విండో చైర్మన్ పత్తి రాము, సిద్దాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ పట్టెపు రాములు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

వేల్పూర్: పడగల్ గ్రామానికి చెందిన రైతు గైని ప్రేమ్ ఇటీవల తన ఫోన్‌ను పోగొట్టుకోగా దానిని పట్టుకొని మంగళవారం బాధితునికి అప్పగించినట్లు ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసులను ఎస్సై అభినందించారు.

ఏడాదైనా పనుల జాడేలేదు

- పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరుకే పరిమితం
- పనులు చేపట్టేందుకు ముందుకురాని గుత్తేదార్లు



తొండాకూర్‌లో మధ్యలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరై ఏడాది పూర్తయినా వాటి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఉపాధి హామీ నిధులు కావడంతో బిల్లులు త్వరగా రావనే కారణంతో గుత్తేదార్లు వెనకడుగు వేస్తున్నారు. మారంపల్లి, తొండాకూర్, జీజీ నడ్కుడ, చిన్నయానం, కోమట్‌పల్లి కలిపి మొత్తం ఐదు పంచాయతీలకు సొంత భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం గతేడాది జూలైలో ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో భవనానికి రూ.20లక్షలు మంజూరు చేయగా, వీటి నిర్మాణ బాధ్యతలు పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. ప్రస్తుతం ఒక్క తొండాకూర్‌లోనే పంచాయతీ బిల్డింగ్ పనులు మొదలవగా స్లాబ్ లెవల్ వరకు నిర్మించి బిల్లులు రాకపోవడంతో ఆపేశారు. మారంపల్లిలో పాత పంచాయతీ భవనాన్ని కూల్చివేసి పనులకు కొబ్బరికాయ కొట్టినా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఈ గ్రామంలో పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. పాలకవర్గ సమావేశాలకు, పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందిగా మారింది. అదే విధంగా జీజీ నడ్కుడ, చిన్నయానం, కోమట్‌పల్లి గ్రామాల్లోనైతే నిర్మాణ పనులకు కనీసం కొబ్బరి కాయ కూడా కొట్టలేదు. చిన్నయానం, కోమట్‌పల్లి పంచాయతీలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.

సరిపోని నిధులు...

పంచాయతీ భవనాలు టెండరు పద్ధతిలో కాకుండా నామినేషన్ పద్ధతిలో జీపీ తీర్మానం చేసి గుత్తేదార్లకు పనులు అప్పగించాల్సి ఉంది. ఈజీఎస్ నిధులు కావడంతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో భవనాన్ని నిర్మించలేమని గుత్తేదార్లు ముందుకు రావడం లేదు. విలువను రూ.25 లక్షలకు పెంచితే తప్ప తాము ఈ పనులు చేయలేమని అధికారులకు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ డీఈఈ కిషన్‌ను వివరణ కోరగా, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి



విద్యార్థులతో సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌టౌన్(బోధన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో హాజరయ్యారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. కళాశాల ఆవరణలో ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించి, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

చదువుతో పాటు సమాజ సేవ చేయాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ చేసే అలవాటును అలవర్చుకోవాలని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని గల గురుకుల డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నందిపేట్(ఆర్మూర్): అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమం చైర్మన్ అర్గుల చిన్నయ్య, అధికారులు వెంకటేశం, శ్రీనివాస్, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి



సభకు వెళ్తున్న సాలూర మండల రేషన్ డీలర్లు

బోధన్: ఎన్నికల సమయంలో రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సాలూర మండల రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమీషన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీని ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రేషన్ డీలర్ల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో నిర్వహించనున్న సభకు సాలూర మండల డీలర్లు తరలి వెళ్లారు. సంఘం మండల ప్రెసిడెంట్ శేఖర్, సెక్రెటరీ రాహుల్ లక్ష్మణ్, ప్రతినిధులు డిస్కో సాయిలు, రాజుపటేల్, సాలెన్ సంజీవ్ కుమార్, కామిరెడ్డి చిన్నపురెడ్డి, మల్లయ్య, ఉదయ్ ఉన్నారు.

శుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న ఆర్మూర్ ఎమ్మెల్యే



రక్తదానం చేస్తున్న కోటపాటి అభిమానులు

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్: పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా 'స్వచ్ఛతాహీ సేవ – 2024' పేరిట తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదినం సెప్టెంబర్ 17 నుంచి మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య సేవల గురించి మున్సిపల్ కమిషనర్ రాజు, ఎమ్మెల్యేకు వివరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించే బాధ్యత నాది

ఆర్మూర్: నియోజకవర్గ పరిధిలో అనారోగ్యం బారిన పడిన వారు చికిత్స చేయించుకోవడానికి అయిన ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం వారినుద్దేశించి మాట్లాడారు. ఆర్మూర్ సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్ పాల్గొన్నారు.

కోటపాటికి ప్రత్యేక గుర్తింపు

ఆర్మూర్: పసుపు రైతుల సమస్యల, ప్రవాస భారతీయుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో కోటపాటి నర్సింహ నాయుడు చేసిన ఉద్యమాలే ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కొనియాడారు. ఆర్మూర్ పట్టణంలో ప్రవాస భారతీయుల హక్కుల, సంక్షేమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహం నాయుడు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం యువకులు రక్తదానం చేశారు. కోటపాటి రాజకీయ గురువు లోక భూపతిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భూస అంజయ్య, న్యాయవాదులు ఎంకే నరేందర్, బాలయ్య, గణేష్, తదితరులున్నారు.

వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గూండ్ల చెరువుతో పాటు పెర్కిట్, మామిడిపల్లి, కోటార్మూర్ చెరువుల్లో పేరుకుపోయిన నిమజ్జన వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈనెల 23న సోమవారం సాక్షిలో 'పేరుకుపోయిన నిమజ్జన వ్యర్థాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి మంగళవారం వ్యర్థాలను తొలగించారు.

ఆరోగ్య వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

బోధన్: ప్రతి విద్యార్థికి సంబంధించిన 21 ఆరోగ్య అంశాలను కొత్తగా ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రశస్త యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని బోధన్ ఎంఈవో నాగ్‌నాథ్ పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. దీంతో ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించేందుకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కార్యాలయంలో బోధన్, సాలూర మండలాల ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిమ్స్ వైద్యులతో ఫిజియోథెరపి చికిత్స పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ నాగయ్య, వివిధ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సూర్యకుమార్, రత్నాకర్ పాల్గొన్నారు.

'సబ్సిడీపై యంత్రాలను అందజేస్తాం'



అవగాహన కల్పిస్తున్న స్పైస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్

బాల్కొండ: రైతు ఉత్పత్తుల సేవా సంస్థలో సభ్యులుగా ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీపై పసుపు ఉడకబెట్టే యంత్రాలను, పసుపు పాలిష్ చేసే యంత్రాలను అందిస్తామని స్పైస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేశన్ అన్నారు. మంగళవారం వన్నెల్(బి)లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు పంటను బెడ్ విధానంలో, ఆర్గానిక్ మందులతో సాగు చేయాలన్నారు. పసు పంటకు దుంపకుళ్లు సోకకుండా సకాలంలో చర్యలు తీసుకుంటే మంచి దిగుబడి వస్తుందన్నారు. ఎఫ్‌పీవో అధ్యక్షుడు నాగులపల్లి రాజేశ్వర్, బాల్కొండ వ్యవసాయ అధికారి బద్దం లావణ్య రైతులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానం



ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీడీవో, ఇతర అధికారులు

కమ్మర్‌పల్లి: సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానమని కమ్మర్‌పల్లి ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. భాస్కరా ఫార్మసీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఆంధ్రయ్య, భాస్కరా ఫార్మసీ వ్యవస్థాపకులు భాస్కర్ యాదవ్, నోడల్ అధికారి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి



పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన సుర్బిర్యాల్ గ్రామస్తులు

ఆర్మూర్‌టౌన్: సుర్బిర్యాల్ తాజా మాజీ సర్పంచ్ సట్లపల్లి సవిత భర్త గణేశ్ అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలో దళిత బంధు డబ్బులతో ప్రభుత్వ స్థలంలో గణేశ్ చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని, ఆక్రమించుకున్న ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను సర్వజన సంఘం సభ్యులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో గణేశ్‌కు సర్వజన సంఘం సభ్యులతో గొడవ జరిగింది. ఈ విషయమై గణేశ్ సర్వజన సంఘంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామస్తులంతా ఇంటికొకరు చొప్పున వచ్చి మంగళవారం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్ గజానాంద్ కలగజేసుకుని గ్రామస్తులతో చర్చించి అవినీతిపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రీయ హిందూ సమ్మేళనానికి ఆహ్వానం



పెర్కిట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనానికి హాజరు కావాలని ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ఆహ్వానం పలికారు. అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న రాజు అనే విద్యార్థిని చితక బాదిన ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవరం పాఠశాలలో విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దాల నాగరాజు, టీఎన్‌వీఎస్ నాయకుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

ఆర్మూర్‌టౌన్: సమాచార హక్కు చట్టం ప్రజలకు ఒక వజ్రాయుధమని సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ న్యాయవాది గటడి ఆనంద్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో విద్యార్థినులకు మంగళవారం సమాచారాం హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డి.రాగలత, వైస్ ప్రిన్సిపల్, స్పందన, లక్ష్మి, భువన, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు

క్రీడల్లో ఆలూర్ విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లిలో ఇటీవల నిర్వహించిన అంతర పాఠశాలల క్రీడోత్సవంలో ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం నరేందర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు పీడీ రాజేష్‌ను హెచ్‌ఎం అభినందించారు. ఉపాధ్యాయులు అశ్వాక్ , రాజేశ్, శౌరి రెడ్డి తదితరులున్నారు.

సత్య శోధక్ సంస్థ ఆవిర్భావ దినోత్సవం

బాల్కొండ: మోర్తాడ్ మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సత్యశోధక్ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థను స్థాపించిన మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరి రాజారం, మామిడి రవి, బద్ది ప్రవీణ్ పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

బోధన్‌రూరల్: పట్టణ బైపాస్ రోడ్డు వెంబడి గల కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ ప్రతినిధులు, నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. 15వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు, భక్తులు పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. కౌన్సిలర్‌లు తూము శరత్ రెడ్డి, పిట్ల సత్యం, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా డంప్ చేసిన ఇసుక వేలం

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని శివారులో ఇటీవల రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన పది ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంప్‌ను మంగళవారం పోతంగల్ తహసీల్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. వేలంలో సుంకిని గ్రామానికి చెందిన రమేష్ రూ.25 వేలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల శ్రమదానం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మంగళవారం శ్రమదానం నిర్వహించారు. జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా ముందుగా ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల సేకరణ చేశారు. వనసంరక్షణ సమితిలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ ఎస్ రాజ్‌కుమార్,ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లక్ష్మణ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రుద్రూర్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మంగళవారం తెల్లవారుజామున రుద్రూర్ మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్టు ఎస్సై సాయన్న తెలిపారు.

పోతంగల్ మండలంలో..

కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జల్లాపల్లి శివారులో మంగళవారం సాయంత్రం ఇసుక టిప్పర్‌ను, ఇసుక నింపడానికి ఉపయోగించిన జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

విప్లవ పోరాటయోధులకు ఘన నివాళి

బోధన్: ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి, అమరుడు ముక్తార్ పాషా, శ్రీకాకుళం సాయుధ పోరాట యోధురాలు పైల చంద్రమ్మల నాలుగో వర్ధంతిని మంగళవారం పట్టణ కేంద్రంలోని యూనియన్ ఆఫీసులో నిర్వహించారు. ముందుగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య మాట్లాడారు. యూనియన్ బోధన్ ఏరియా కార్యదర్శి ఆర్.సురేష్, నాయకులు శ్రావణ్ పాల్గొన్నారు.

ఒడ్డెట్‌పల్లిలో..

మాక్లూర్: ఒడ్డెట్‌పల్లిలో మంగళవారం కామ్రేడ్ ముక్తార్ పాషా 4వ వర్ధంతి సభను ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దుడ్డు గంగాధర్ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి 2 నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. నేతలు శివకుమార్, అబ్బయ్య, దుర్గా, నవీన్‌లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆర్మూర్‌టౌన్: మొక్కజొన్నకు రూ.500ల బోనస్ ప్రకటించి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు ఆర్మూర్‌లో కల్లాల వద్ద తడిచిన మక్కలను పరిశీలించారు.

ఆరోగ్య సమస్యలు చెప్పటానికి ఇబ్బంది పడొద్దు

మాక్లూర్: మహిళలు వైద్యుల వద్ద ఆరోగ్య సమస్యలు చెప్పటానికి ఇబ్బంది పడొద్దని జిల్లా వైద్య శాఖాధికారి రాజశ్రీ సూచనప్రాయంగా చెప్పారు. మంగళవారం దాస్‌నగర్ వద్ద గల గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన మెగా వైద్య శిబిరానికి రాజశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోషకాహార లోపం, రక్తహీనత కారణంగా విద్యార్థినులు ఇబ్బందిపడుతారన్నారు. విద్యార్థినులకు రక్త పరీక్షలు జరిపి మందులు అందజేశారు. వైద్యులు అంజన, అర్వింద్, కృష్ణ, సలీమొద్దీన్, వెంకటేష్, తుకారాం, మాధవి, మినాజ్, సుమేయా పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



బోధన్‌టౌన్: వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని బోధన్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ కోరారు. మంగళవారం ఆస్పత్రిలో రోగులతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న మందులు, చికిత్సను గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోగులతో దురుసుగా మాట్లాడొద్దని, సమయ పాలన పాటించాలని సూచించారు.

పోచారంలో ఇద్దరికి దేహశుద్ధి

ఎడపల్లి: మండలంలోని పోచారం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని స్థానికులు మంగళవారం దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్సై వంశీచందర్‌రెడ్డిని వివరణ కోరగా గ్రామంలో ఇద్దరు అనుమానాస్పదంగా తిరగడంతో గ్రామస్తులు పీఎస్‌లో అప్పగించారని, వీరిపై విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – మన్యం ధీరుడు (తెలుగు)-1.25, చిక్లెట్స్(తెలుగు)-4.10, ఫైలం పిల్లగా (తెలుగు)-6.50, హైడ్ ఎన్ సీక్ (తెలుగు)-9.40
- స్క్రీన్-3 – మత్తు వదలరా-2(తెలుగు)-12.15 3.15 6.15 9.15
- స్క్రీన్-4 – 35 : సరిపోదా శనివారం (తెలుగు) - 11.30, 3.05, 6.40, 10.15

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 35: చిన్నకథ కాదు (తెలుగు)-4.30, మత్తు వదలరా(తెలుగు)- 7.20 10.25
- స్క్రీన్-2 సరిపోదా శనివారం (తెలుగు) - 1.30 7.25
- స్క్రీన్-3 ట్రాన్స్‌ఫార్మర్స్ (ఇంగ్లీష్ 3డీ) - 11.00, 4.40, 10.35, ప్రేమనగర్ (తెలుగు) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 ఫైలం పిలగా(తెలుగు)-1.15, మత్తు వదలరా-2 (తెలుగు) - 4.00, 7.00, 10.00
- స్క్రీన్-2 ట్రాన్స్‌ఫార్మర్స్ వన్(3డీ ఇంగ్లీష్) - 11.00, 4.35, యుద్ధ (హిందీ) - 1.30, 7.05, స్త్రీ - 2 (హిందీ) - 10.10
- స్క్రీన్-3 35 : మత్తువదలరా-2 -1.15, సరిపోదా శనివారం - 4.15 10.30, తుంబడ్ (హిందీ) - 7.50
- స్క్రీన్-4 చిక్లెట్స్ (తెలుగు)-9.55, తుంబడ్(హిందీ) - 12.35, యుద్ధ(హిందీ)-3.15, ప్రేమాభి షేకం-6.20, ప్రేమనగర్(తెలుగు)-10.10
- లలితామహల్ సరిపోదా శనివారం (తెలుగు)
- దేవి మత్తు వదలరా-2 (తెలుగు)
- నటరాజ్ యుద్ధ (హిందీ)
- విజయ్ ఎ.ఆర్.ఎం 3డీ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	75,900	వెండి (కిలో)	91,000
22 క్యారెట్స్	69,097		

– నిజామాబాద్ బిజినెస్